# అమ్మా.. బైలెల్లినాదో..!

## చిలకలగూడ బోనాలకు పోటెత్తిన భక్తులు



భవిష్యవాణి వినిపించే రంగంకు పచ్చికుండను తెస్తున్న కానుగుల వంశీయులు



చిలకలగూడ బోనాల జాతరలో ఫలహారంబండి ఊరేగింపు దృశ్యం

**చిలకలగూడ:** డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాలు,పోతురాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలు, మహిళల కోలాటాలు, విచిత్రవేష ధారణలు, తొట్టెలు, ఫలహారంబండ్ల ఊరేగింపు, భవిష్యవాణి వినిపించే 'రంగం' కార్యక్రమాలతో చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ బోనాల జాతరలో ఆద్యంతం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మా.. బైలెల్లినాదో పాటలతో అమ్మవారి ఊరేగింపు, సాగునంపు యాత్రలో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల జాతరకు వేలాది మంది హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వంశీయులు కానుగుల ఆంజనేయులు, పాపయ్యలు సమర్పించిన పచ్చికుండపై నిలబడి పాతబస్తీకి చెందిన మాతంగి వేల్పుల ప్రభావతి నిర్వహించిన రంగం కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు భవిష్యవాణి కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

### ప్రత్యేక ఆకర్షణగా తొట్టెలు, ఫలహారంబళ్ల ఊరేగింపు

బోనాల జాతరలో ఫలహారం బండ్ల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పలు ప్రాంతాలకు చెందిన యువత ఆటపాటలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. స్వాగత వేదికలపై నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిలకలగూడ ప్రధాన రహదారిలో నిర్వహించిన జాతర ప్రజలతో కిటకిటలాడింది. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు, స్థానిక కార్పొరేటర్ సామల హేమ, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, ప్రముఖ పారిశ్రామికవేత్త నాగులూరి సాయిబాబా, బీఆర్ఎస్ నాయకుడు తీగుళ్ల రామేశ్వరగౌడ్ తదితరులు ఫలహారంబళ్లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈఓ మహేందర్‌గౌడ్, ట్రస్టుబోర్డు చైర్మన్ గుంటి కృష్ణ నేతృత్వంలో తగిన ఏర్పాట్లు చేపట్టారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చిలకలగూడ బోనాల జాతరలో నృత్యం చేస్తున్న యువత



హమాలిబస్తీ మావురాల రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



సవరాలబస్తీలో ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు రామేశ్వరగౌడ్

## ముఖేష్‌గౌడ్ సేవలు మరువలేనివి



**సనత్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమం కోసం మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ చేసిన సేవలు ఎనలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ కొనియాడారు. ముఖేష్‌గౌడ్ ఐదో వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ముఖేష్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు.

## బ్రాహ్మణ సేవా యువ వాహిని అధ్యక్షుడిగా అఖిల్ శర్మ



నియామక పత్రం అందుకుంటున్న అఖిల్ శర్మ

**లాలాపేట:** బ్రాహ్మణ సేవా వాహిని యువ వాహిని రాష్ట్ర అధ్యక్షుడిగా మెళ్లూరి అఖిల్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం కార్యవర్గ సమావేశం ఇటీవల లాలాపేటలోని శివాంజనేయ దేవాలయ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ యువ వాహిని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం యువ వాహిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మెళ్లూరి అఖిల్ శర్మకు, ప్రధాన కార్యదదర్శి నందూరి పవన్, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కాటూరి వంశీకి బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షులు రఘు కిరణాచార్యులు చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

## అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి



సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీయూఎఫ్ ప్రతినిధులు

**సికింద్రాబాద్:** తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాంబాబు ముదిరాజ్ కోరారు. సోమవారం టీయూఎఫ్ ప్రతినిధులతో కలిసి సీతాఫల్‌మండి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉద్యమకారులకు ఇంటిస్థలం, గుర్తింపు కార్డు, గౌరవ పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూఎఫ్ ప్రతినిధులు దయానంద్, లక్ష్మణ్, నరసింహాచారి. మల్లారి అనిల్, జగన్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

## బోర్‌వెల్‌కు మరమ్మతులు



**రసూల్‌పురా:** గత ఇరవై రోజులుగా పవర్‌బోర్‌వెల్ చెడిపోవడంతో బస్తీ ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన అధికారుల ద్వారా సమస్యను పరిష్కరించారు. బోర్డు వాటర్‌వర్క్స్ అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం చేశారు.

## ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు మరమ్మతులు చేయండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా 40 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు వర్షాలకు కొట్టుకు పోయి గుంతలుగా మారింది. రోడ్డు పూర్తిగా పాడవకముందే మరమ్మతులు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 53, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 32, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 40, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 55, సొరకాయ 9

## యువతి అదృశ్యం

**రసూల్‌పురా:** ఆసుపత్రికి వెళ్లి వస్తానంటూ వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లఖన్ రాజ్ తెలిపిన మేరకు .. కంటోన్మెంట్ సిక్‌విలేజ్‌లో నివాసం ఉండే ఆర్మీ ఉద్యోగి యుగల్ సింగ్ కుమార్తె(18) ఇంటర్ పూర్తిచేసి ఇటీవల జేఈఈలో ర్యాంకు సాధించింది. ఈ నెల 26న సాయంత్రం తల్లితో పాటు మార్కెట్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చే సమయంలో ఆస్పత్రికి వెళ్లి తన చెవికి వైద్యం చేయించుకుంటానని చెప్పి వెళ్లింది. అలా వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కృష్ణతేజ

**వెంగళరావునగర్:** జాతీయస్థాయిలో జరగనున్న బాస్కెట్‌బాల్ పోటీలకు యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) స్కూల్ విద్యార్థి పి.కృష్ణతేజ ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పి.కృష్ణతేజ తన ప్రతిభను చాటుకున్నాడు. స్టూడెంట్స్ ఒలింపిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారులు ఈ విద్యార్థిని త్వరలో హరియాణాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. దీనిని పురస్కరించుకుని సోమవారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక వేడుకల్లో యాజమాన్యం కృష్ణతేజను అభినందించింది. ఎంజీఎం స్కూల్ చైర్మన్ ఎంఎం నాయుడు మాట్లాడుతూ..ృష్ణతేజ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

## ఉత్సాహంగా ఫలహారబండ్ల ఊరేగింపు



ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి

**రసూల్‌పురా:** ఆషాఢమాసం బోనాల జాతరలో భాగంగా సోమవారం ఫలహారబండ్ల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్‌లు సిక్‌విలేజ్ మహంకాళి ఆలయం, రసూల్‌పురాలోని నల్లపోచమ్మ కట్టమైసమ్మ ఆలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఫలహారబండ్లను ప్రారంభించారు. కార్యక్రమం లో అశోక్, గిరి, రాజు, వెంకటేష్, సురేష్ రమేష్, రాజేల్లి తదితరులు పాల్గొన్నారు.

**తార్నాకలో...**

**లాలాపేట:** ఆషాఢమాస బోనాల వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం తార్నాక డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. తార్నాక లంబాడ బస్తీలో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమానికి మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి ముఖ్యతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వీరన్న, నిర్వాహకులు శ్రీనివాస్ నాయక్, గోపాల్ నాయక్,నరసింహా నాయక్, మోహన్ నాయక్ తదితరులున్నారు.





పూజలో పాల్గొన్న సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్

## కనుల పండువగా పాలకావడి ఉత్సవం



**పద్మారావునగర్:** సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన స్కందగిరి శ్రీ సుబ్రమణ్యం దేవాలయంలో సోమవారం పాలకావడి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తుల కోలాహలంతో దేవాలయ ప్రాంగణం జన సంద్రంగా మారింది. పాలకావడి ఉత్సవం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకావడిని భుజాన మోసుకుంటూ భక్తులు దేవాలయం చుట్టు గిరి ప్రదర్శన చేశారు. దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దానం



**సనత్‌నగర్:** బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర దేవస్థానం ప్రాంగణంలో కొలువుదీరిన భూలక్ష్మి అమ్మవారిని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేస్తూ విశాల్ సూదంకు అభినందనలు తెలిపారు. అంతకముందు భక్తుల సమక్షంలో రంగం కార్యక్రమం జరిగింది. అమ్మవారి ముందు స్వర్ణలత నిలబడి పూజలు బాగా జరిగాయి..వర్షాలు బాగా పడతాయి..అని భవిష్యవాణి వినిపించారు.

## పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షం

### చిలకలగూడ రంగం కార్యక్రమంలో భవిష్యవాణి



రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి ప్రభావతి



చిలకలగూడ బోనాల జాతర దృశ్యం

**చిలకలగూడ :** వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం అవుతాయని చిలకలగూడ రంగం కార్యక్రమంలో భవిష్యవాణి వినిపించింది. చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన మాతంగి వేల్పుల ప్రభావతి పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి ద్వారా భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఎటువంటి వైరస్‌లు వ్యాపించకుండా రాష్ట్ర ప్రజలను ఆరోగ్యంగా ఉంచుతానని, సుఖశాంతులతో వర్ధిల్లుతారని ఆశీర్వదించింది. భక్తుల పూజలతో సంతృప్తి చెందానని, తొమ్మిది వారాలపాటు సాక పోయాలని కోరింది. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని ఓ భక్తుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. దేవదాయశాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఈఓ మహేందర్‌గౌడ్, కార్పోరేటర్ సామల హేమ, ట్రస్టుబోర్డు చైర్మన్ గుంటి కృష్ణలతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**AUCTION NOTICE**

It is hereby notified that the under mentioned land/ property will be sold by publication for arrears of revenue under the provisions of Section-36 of Telangana Revenue Recovery Act II of 1864 unless the defaulter or other person acting on his behalf, or claiming an interest in the land, tenders the full amount of the arrears of revenue, with interest and other charges, before sunset on the day 07.08.2024 to that appointed for the sale i.e., 08.08.2024.

| | |
|---|---|
| Taluk | Secunderabad |
| Village | Bholakpur |
| Survey Number Sub-Division | Part of T.S.No.48, 'L' Block, '102' Ward |
| Description of the land/ Property (whether Nanja, Punja or garden) and of any building on it belonging to the defaulter | (Revised estimate) 2,119.98 Sft & 550.02 Sft put together 2,670 Sft plinth area along with 61.65 Sq.yards and 15.95 sq.yards together 77.60 Sq.yards of undivided share of land in Unit No.3, First floor, building known as 'Dr.Pandit Rao Patnekar's Mythri Arcade' with the following schedule: **North**: 40' wide road, **South**: 18' width passage, **East**: Common staircaseUnit No.1&2, **West**: Unit No.4 |
| Estimated extent | 2,670 Sft |
| Amount of arrears due (upset price) | Rs.2,24,46,319/- (Two Crores Twenty four lakhs forty six thousand three hundred nineteen rupees only) |
| (Upset price) | Rs.2,24,46,319/- (Two Crores Twenty four lakhs forty six thousand three hundred nineteen rupees only) |
| Name of the defaulter | Vasavi Co-op Urban Bank Ltd, M.G. Road Branch |
| Date of Sale | 08-08-2024 at 11.00 AM |
| Place of sale | Unit No.3, 'Dr.Pandit Rao Patnekar's Mythri Arcade', M.G. Road, Secunderabad |
| Terms of Sale | 1. A demand draft from any Nationalized bank for an amount of Rs. 33,66,947.31 ps., to be drawn in the name of tahsildar, Secunderabad and shall be presented before the undersigned authority as a condition to participate in the public auction. 2. The successful bidder shall also deposit 15% of the sale amount on the date of sale and the remaining within (30) days from the date of sale failing which the 15% of sale amount shall be forfeited. 3. The defaulter is entitled to deposit the arrears of revenue namely Rs.2,24,46,319/- before the date of auction namely 07.08.2024 (before the expiry of working hours). 4. The defaulter can deposit the arrears amount one day before the date of auction till end of the working day. |

Station : Secunderabad
Dated : 27.07.2024

Sd/- Tahsildar
Secunderabad Mandal, Hyderabad District

## క్రైం కార్నర్..

### అకారణంగా వ్యక్తిపై దాడి

**వెంగళరావునగర్:** టీ తాగడానికి వచ్చిన వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రహమత్‌నగర్ కమాన్‌గల్లీకి చెందిన మహ్మద్ ఇషాక్ ఆదివారం టీ తాగడానికి షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయానికి దీపక్ అనే వ్యక్తి అడ్డుగా నిలబడ్డాడు. పక్కకు జరగమన్నందుకు దీపక్ ఆగ్రహించి ఇషాక్‌పై దాడి చేశాడు. స్థానికులు అడ్డుకోగా దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ఇషాక్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ల్యాప్‌టాప్ కొనడానికి వచ్చి చోరీ

**వెంగళరావునగర్:** ల్యాప్‌టాప్ కొనడానికి వచ్చానని చెప్పి చోరీకి పాల్పడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఈనెల 28న ఎస్‌ఆర్‌నగర్‌లోని ఎలక్ట్రానిక్స్ షాపులోకి యువతి వచ్చి షాపు యజమాని రాజీవ్‌గౌడ్‌తో తాను ల్యాప్‌టాప్ కొనడానికి వచ్చినట్టుగా చెప్పింది. కొద్దిసేపు పరిశీలించి తన ఫ్రెండ్ వచ్చాక తీసుకుంటానని, అప్పటి వరకు షాపులో ఉంటానంది. రాజీవ్‌గౌడ్ మరో కస్టమర్‌తో మాట్లాడటానికి వెళ్లి తిరిగి వచ్చాడు. అయితే యువతితోపాటు ల్యాప్‌టాప్ అదృశ్యమైంది. దీంతో రాజీవ్‌గౌడ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### సిగరెట్ పీకలు వేయవద్దన్నందుకు కానిస్టేబుల్‌పై దాడి

**వెంగళరావునగర్:** సిగరెట్ పీకలు వేయవద్దన్నందుకు ముగ్గురు యువకులు కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక సిద్ధార్థనగర్‌కాలనీలోని ప్రశాంక్ అపార్ట్‌మెంట్స్‌లో సమ్మయ్య కుటుంబ సభ్యులు నివసిస్తుంటారు. గత రెండు నెలల నుంచి పక్క అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న ముగ్గురు యువకులు ప్రతిరోజూ సిగరెట్లు తాగి పక్కనే ఉంటున్న సమ్మయ్య ఇంటి ముందు వేస్తున్నారు. అనేకసార్లు చెప్పినా వారు వినలేదు. ఆదివారం మధ్యాహ్నం సమ్మయ్య సతీమణి, వాచ్‌మెన్ దస్తయ్యలు యువకులతో సిగరెట్ పీకలు వేయవద్దని చెప్పారు. దీంతో ఆగ్రహించిన నరేష్ చౌదరి, మనోహర్‌రెడ్డి, మోహిత్ నాగేంద్రలు ఆమెను దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఆమె తన కుమారుడు కానిస్టేబుల్ అయిన సాగర్‌కు తెలియజేసింది. విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన సాగర్ తన తల్లిని ఎందుకు దూషించారని , సిగరెట్ పీకలు వేయవద్దు అని సదరు యువకులను నిలదీయగా అప్పటికే మద్యం సేవించి ఉన్న వారు సాగర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### గంజాయి విక్రేత అరెస్టు

- 2.105 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

**బంజారాహిల్స్:** హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు నుంచి ఓ యువకుడు పెద్ద మొత్తంలో డ్రై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన యశ్ అగర్వాల్ గత కొంతకాలంగా ఒడిస్సా నుంచే గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తెలిసిన కస్టమర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులో మాటువేశారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న యశ్ అగర్వాల్‌ను ఆపి సోదాలు నిర్వహించగా 2.105 కిలోల డ్రై గంజాయి బ్యాగ్‌లు పట్టుబడ్డాయి. నిందితుడిని అరెస్టు చేసి బైక్‌తో పాటు గంజాయిని సీజ్ చేశారు.

## ఫ్లైఓవర్‌ను పరిశీలించిన అధికారులు



**ఖైరతాబాద్:** ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై వరుసగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజినీర్, ట్రాఫిక్ ఇంజినీర్ సెల్ విభాగం అధికారులు సోమవారం ఫ్లై ఓవర్‌ను పరిశీలించారు. ఫ్లై ఓవర్‌పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఏం చేయాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. ఫ్లై ఓవర్‌పై స్పీడ్ లిమిట్‌ను సూచిస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు, రెండు వైపులా 5 ఇంచ్‌ల మేర స్పీడ్‌ను కంట్రోల్ చేసే రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు, ట్రాఫిక్ సైన్ బోర్డులు, చెట్ల కొమ్మల తొలగింపు చేయడంతో పాటు స్పీడ్ లిమిట్, ఓవర్ టేకింగ్ కంట్రోల్, ఫ్లై ఓవర్ మొదట్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. జీహెచ్ఎంసి డిప్యూటీ ఇంజినీర్ కృష్ణ చైతన్య, ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లీకేజీని అరికట్టండి

**బన్సీలాల్‌పేట్:** సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో మంచినీటి లీకేజీలతో రోడ్లు జలమయంగా మారుతున్నాయి. పద్మారావునగర్, బోయిగూడ, రాణిగంజ్, మోండా మార్కెట్, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై మంచినీటి లీకేజీలు కొనసాగుతున్నాయి. పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని స్వరాజ్య ప్రింటింగ్ ప్రెస్ ఎదురుగా ఉన్న రోడ్డుపై మంచినీరు ఏరులైపారుతున్నది. రోజుల తరబడి నుంచి మంచినీరు వృథాగా పోతున్నా జలమండలి సిబ్బంది మాత్రం తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

